ఎందుకో తెలీదు - అతడికి సడెన్‌గా ప్రవల్లిక గుర్తుకొచ్చింది. ఏం చేస్తూ వుండి వుంటుందామె? బహుశా స్వామిని ఎలా ఎదుర్కోవాలా అని ఆలోచిస్తూ వుండి వుంటుంది. తనేమో ఇక్కడ కర్తవ్యం మర్చిపోయి ఇలా రొమాంటిక్ మూడ్‌లో .....

"ఏమిటి అలా అయిపోయారు ..... "

"చాలా దుర్భేద్యమయిన కోట అది. ఏ మార్గం నుంచి లోపలికి ప్రవేశించాలా అని ఆలోచిస్తున్నాను. సూర్యారావు, రామ్‌లాల్, పరమేశ్వరం ..... చాలా పెద్ద పెద్ద వాళ్ళు కాపలా కాస్తున్నారు దాన్ని."

"మీరు చెప్పేది నాకు అర్థం కావడంలేదు."

అతడు మాట్లాడలేదు. వర్షం చప్పుడు వింటూ ఇద్దరూ మౌనంగా వుండిపోయారు. దాన్ని భంగపరుస్తూ ఆమె అంది - "సూర్యారావు అంటే మినిష్టర్ సూర్యారావేగా?"

"అవును. ఏం?"

"ఏంలేదు ఆయన కూతురు మా కాలేజే"

అతడు తిరిగి ఆలోచనల్లో మునిగిపోయాడు. మరో రెండు నిమిషాలు గడిచాయి. ఒక చిన్న మెరుపు - ఆకాశంలో - అతడి మెదడులో.

అది తట్టగానే అతడు నిటారుగా అయ్యాడు. ఆమె అతడివేపే చూస్తోంది.

"మాలా! ఆ అమ్మాయిని నువ్వు నాకు చూపించగలవా?" అని అడిగాడు.

* * * *

ఇందిరాగాంధీ మహిళా కళాశాలలోంచి అమ్మాయిలు గుంపులు గుంపులుగా బయటకు వస్తున్నారు. అందులో ఒకమ్మాయి కాస్త విడిగా వస్తోంది.

విహారి కారు దిగి ఆమె దగ్గరకు వెళ్ళాడు.

"మాడమ్! మీ నాన్నగారికి హార్టు అటాక్ వచ్చింది. ఇప్పుడే ఢిల్లీ నుంచి తీసుకొచ్చారు"

ఆ అమ్మాయి బిత్తరపోయింది. భయం కొట్టొచ్చినట్లు కనపడింది. ఆందోళనగా "ఎక్కడున్నారు?" అనడిగింది.

"ఆస్పత్రిలో ..... మీరు అర్జంట్‌గా రావాలి"

"ఇద్దరూ కారెక్కారు. కారు కదిలింది.

"ఎక్కడ? ఏ అస్పత్రిలో?" అనడిగింది.

"సారీ మాడమ్ యు ఆర్ బీయింగ్ కిడ్నాప్డ్" తాపీగా అన్నాడు.

ఆమె ఉలిక్కిపడింది. చేతులు వణకడం స్పష్టంగా కనిపిస్తోంది.

ఆమె దిగడానికి వీల్లేకుండ కారు వేగం హెచ్చించాడు. రెండు మూడు నిమిషాలు మాట్లాడకుండా అలా నిశ్శబ్దంగా డ్రయివ్ చేసి, ఆమె వేపు చూశాడు.

రక్తం లేనట్లు ఆమె మొహం పాలిపోయింది. అతి కష్టంమీద ఏడుపు

ప్రారంభించాలో అర్థంకాలేదు. “మిమ్మల్ని ‘చెల్లీ’ అని పిలవచ్చునా?” అని అడిగాడు.

ఆమె ఉలిక్కిపడి అయోమయంగా చూసింది. అతడు స్నేహపూర్వకంగా నవ్వేడు. ఆమె ఇంకా అలానే చూస్తూంది. నా పేరు విహారి ..... నికుంజ్ విహారి” అన్నాడు. “నేను కిడ్నాపర్ కాను. ప్రొఫెషనల్ కిడ్నాపర్ ఎవరూ తమ పేరు చెప్పరు” అన్నాడు. ఆమె మాట్లాడ లేదు. ఇంకా బెదురునుంచి బయటపడలేదు.ఈ లోపులో అతడి కంఠం మంద్రస్థాయిలో వినిపించసాగింది.

ప్రతివాళ్ళూ విప్లవం గురించి, నైతిక విలువల గురించి మాట్లాడతాడు. అది తమనుంచే ప్రారంభం కావాలనుకోరు. రాత్రిళ్ళు రిహార్సల్స్ అయ్యాక బార్లో గొంతు దాకా మందుకొట్టి సమసమాజం గురించి మాట్లాడిన మా వాళ్ళు, ఇంటి కెళ్ళడానికి రిక్షావాడితో ఇరవై పైసల కోసం అరగంట వాదించడం నేను స్వయంగా చూశాను. అదే అడిగితే కష్టపడి సంపాదించిన డబ్బు బ్రదర్ అనటం కూడ నేనెరుగుదును. ఎందుకు? మీ కాలేజీలోనే ‘లంచగొండితనం రూపుమాపటం ఎలా?’ అన్న టాపిక్‌ని వక్తృత్వ పోటీల్లో పెట్టండి. సగం మందికి పైగా స్టూడెంట్స్ లంచగొండులను పట్టుకుని బుద్ధివచ్చేలా శిక్షించాలి. మళ్ళీ ఈ పని లేకుండా పాఠం చెప్పాలి. వీలయితే ఉరిశిక్ష కూడా విధించాలి అని ఆవేశంగా మాట్లాడుతారు. అందులో చాలామంది ప్రభుత్వోద్యోగుల సంతానమే! వారికి నిజంగా తెలీదా? తమింటికి వచ్చే “ప్రజంటేషన్లు.” తమతండ్రులు సంపాదించే “ఆస్థులు” వెనుక దారిగుండా వచ్చినవే అని ..... అయినా వాటిని అనుభవిస్తూ వుంటారు. ఎవరయినా దీని గురించి అడిగితే “మొత్తం ప్రపంచమే అలా వుంది మా నాన్నగారు మాత్రం మడిగట్టుకు కూర్చుంటే సరిపోయిందా” అంటారు. ఈ వాదన ఎంతవరకూ నిజమో నాకు తెలీదు. బహుశా వ్యవస్థ మొత్తం కరప్ట్ అయిపోయినప్పుడు లంచం ఇవ్వటం కూడా మనిషి దినచర్యలో భాగంగా అయిపోయి వుండవచ్చు. అందుకే ఎవరూ తిరగబడటం లేదేమో! కానీ కేవలం ఒకే ఒక్క మనిషికి ఈ రకమయిన అరాచకం అంతులేని నష్టం కలుగచేస్తే అప్పుడా మనిషి ఏం చేస్తాడు? పదిమందికి చెప్పి అందర్నీ సమకూర్చుకోడానికి ప్రయత్నం చేస్తాడు. ఎవరూ తనకి రాకపోతే, ఏమాత్రం పౌరుషం ఉన్నవాడయినా, ప్రాణాలకు తెగించి ఒక్కడే తిరగబడతాడు. ప్రస్తుతం నేను చేస్తున్న పని అదే.”

అతనింత సేపు ఇంత నెమ్మదిగా, స్ఫుటంగా మాట్లాడటం ఆమెకి ధైర్యాన్నిచ్చింది. ఏదో దురుద్దేశ్యంతో అతడు తనని కిడ్నాప్ చేసినట్లు అనిపించలేదు. పైగా అతడిలో విలనీ కన్నా, కళ్ళల్లో పట్టుదల కనిపిస్తోంది. దాంతో ఆమెలో భయం పోయి, ఆ స్థానే కుతూహలం చోటు చేసుకుంది.

“ఇదంతా నాకెందుకు చెపుతున్నారు?” అనడిగింది.

“మొన్న కొంతకాలం క్రితం అమాయకుడైన ఒక చిన్న కుర్ర వాడ్ని, అభం శుభం తెలియని పసివాడ్ని చంపి అసెంబ్లీ ముందు పడేశారు గుర్తుందా?”

“పేపర్‌లో చూశాను.”

“అలా చంపిన వాడిమీద మీ ఉద్దేశం ఏమిటి?”

"ఆ కిరాతకుల్ని పట్టుకుని బుద్ధి వచ్చేలా శిక్షించాలి. మళ్ళీ ఆ పని చేయకుండా బుద్ధి చెప్పాలి. ఉరిశిక్ష విధించాలి."

విహారి నవ్వేడు. "సరిగ్గా రెండు నిమిషాలక్రితం నేనన్న మాటలే మీరూ అంటున్నారు."

"నేను మామూలుగా అనడంలేదు. మనస్ఫూర్తిగా అంటున్నాను."

"వాళ్ళు మీ దగ్గర వాళ్ళయితే?"

"ఎవరయినా సరే ..... " స్వరం హెచ్చించి అంది.

అతడు తాపీగా "తండ్రే అయితే?" అన్నాడు.

ఆమె పిడుగు పడ్డట్టు చూసింది. "ఏమన్నారు?"

"ఆ పిల్లవాడు చనిపోవడనికి కారణం మీ తండ్రే అయితే - అని అడుగుతున్నాను."

"ఆమె అతడివేపు అనుమానంగా చూసింది. "మీరు నేనెవరని అనుకుంటున్నారో - నేను మినిష్టర్ సూర్యారావుగారి అమ్మాయిని."

"ఛీఫ్‌మినిష్టర్ అవటానికి మీ తండ్రి ఆడిన నాటకమే ఇదంతా మిస్ వరలక్ష్మి! రాష్ట్రంలో అది కుదరకపోవటంతో సెంటర్‌లో మినిష్టరయ్యాడు."

"నో ..... నేను నమ్మను" అని అరిచింది.

"ఇదంతా నేను మీకు చెప్పనవసరం లేదు. మామూలుగా ఒకటి రెండురోజులు మిమ్మల్ని కిడ్నాప్‌చేసి నా పని నేను పూర్తికావించవచ్చు! కానీ మీకీ విషయం అంతా చెప్పడంలో నా ఉద్దేశ్యం మిమల్ని మాలో కలుపుకోవాలని! వయసు పెరిగేకొలదీ వ్యామోహం పెరుగుతుంది. స్వార్థం హెచ్చుతుంది. యువతలో ఆ రెండూ వుండవు. కాబట్టే దేశాన్ని బాగుచెయ్యాలన్నా - పాడుచెయ్యాలన్నా అది యువతవల్లే సాధ్యం అంటారు అనుభవజ్ఞులు. మీ తండ్రి గురించి చెప్పాలంటే చాలా ఉంది. అంతటి దుర్మార్గుడు. క్రూరుడు మరొకరు వుంటారని నేను అనుకోను. అయితే అతడు స్వయంగా మర్డర్లు చేయడు. పదవికోసం ఏమయినా చేస్తాడు సిసలయిన రాజకీయ నాయకుడు" అంటూ స్వామి పిల్లల్ని కిడ్నాప్ చేయటం నుంచి, తమని చంపే ప్రయత్నం వరకూ అంతా చెప్పాడు. అసెంబ్లీ ముందు పిల్లవాడిని పడెయ్యటం గురించి కూడా చెప్పాడు.

ఆమె పెదవులు వణుకుతున్నాయి. అది ఆవేశమా తెలీదు. ఉద్విగ్నతో తెలీదు. "ఇది ..... ఇదంతా నిజమా? నేను నేను నమ్మను ..... నమ్మలేను" అంది.

"పోలీసుల్లాగా మీరుకూడా సాక్ష్యాలు అడిగితే నేనేమీ చెప్పలేను. నిరూపించలేని నిజాలు ఇవి, కానీ మీ మనస్సాక్షికి నిజం తెలియాలంటే నేను చెప్పినట్లు చెయ్యండి" అంటూ ఆమెకు వివరించాడు. ఐదు నిముషాల తరువాత ఆమె ఢిల్లీ ఫోన్ చేసింది. అతను పక్కనే వున్నాడు.

"నాన్నా!"

"ఓ! నువ్వా తల్లీ! ఎలా ఉన్నావు, ఏమిటి విశేషాలు? ఎక్కడి నుంచి చేస్తున్నావు? ఇంటి దగ్గరుండేనా?" ప్రశ్నలవర్షం కురిపించాడు. సూర్యారావుకి కూతురంటే వల్లమాలిన ప్రేమ

"ఇంటి దగ్గర్నించే నాన్నా!"

"బాగా చదువుతున్నావా?"

"చదువుతున్నా ..... నాన్నా!"

"ఏమిటి?"

"నిన్న అనంతానంతస్వామి దర్శనానికి వెళ్ళాను"

"ఎందుకు?"

"ఫ్రెండ్స్ అందరితో కలిసి వెళ్ళాను. నన్ను ఆయన గుర్తుపట్టాడు. సూర్యారావు కూతురువి కదూ అంటూ పలకరించాడు" అని ఆగింది.

ఆ తర్వాత మళ్ళీ నెమ్మదిగా "నాన్నా ..... " అంది.

"ఏమిటమ్మా ..... ఏదో అడుగుదామనుకుంటున్నట్టున్నావు."

"మీ నాన్నకి మంత్రి పదవి నేనే ఇప్పించానన్నారు ఆయన" అని పూర్తిచేసింది. అట్నుంచి సూర్యారావు నవ్వేడు - "అననీ ఆయన గురువు లాంటివాడు. ఆయన ప్రసాదమే అనుకో అది" అతడి మాటలు పూర్తికాలేదు.

"యజ్ఞంలో బలి ఇచ్చినట్టు మీ నాన్న పదవికి పసిపిల్లాడిని బలి ఇవ్వవలసి వచ్చింది - అని కూడా నవ్వేడు నాన్నా."

"అటు సూర్యారావు మొహంలో నవ్వు మాయమైంది. ఇరిటేషన్ నిండిన కంఠంతో - "వాడి మొహం" అన్నాడు.

ఆమె నెమ్మదిగా " .... నిజమా నాన్నా" అనడిగింది.

"లేదమ్మా! ఎవడో కుర్రవాడు అసెంబ్లీ ముందు ఛస్తే అది నా మంత్రి పదవి కోసం అని ఎలా అంటాడు? నేను కనుక్కుంటాలే."

"యజ్ఞంలో కుర్రవాడి 'బలి' అని నేను అన్నప్పుడు ఆ కుర్రవాడు. అసెంబ్లీ ముందు చనిపోయిన వాడే అని నేను చెప్పకుండానే నీకెలా తెలిసింది నాన్నా!" అడగాలనుకుంది అడగలేదు. అర్థమయిపోయింది. ఒక్కసారిగా వేయి లంఖణాలు చేసినట్టు నిస్సత్తువగా, నెమ్మదిగా ఫోన్ పెట్టేసింది. విహారితోపాటు వెళ్ళి కారులో కూచుంది.

"ఇప్పుడు చెప్పండి. అలాంటి దుర్మార్గుడ్ని ఖండ ఖండాలుగా చీల్చినా పాపం వుందా?"

ఆమె మాట్లాడలేదు.

ఇదంతా నేను నీకు చెప్పనవసరం లేదు. మామూలుగా కిడ్నాప్ చేసి నా పనులు చేసుకోగలను. కానీ ముందే చెప్పినట్టు యువతమీద నా నమ్మకాన్ని పెంచుకోవడం కోసం ఇదంతా చేశాను. చెప్పు, నువ్వు నాతో కలుస్తావా?

ఆమె వెంటనే జవాబు చెప్పకుండా ఆగి, " ..... నేనేం చెయ్యాలి?" అనడిగింది.

"ఏమీ చెయ్యనవసరం లేదు. నేరుగా తిరిగే మోసపు చక్రం నుండి అనంతానంతస్వామి

అనంతమైన వేగంతో దీన్ని తిప్పుతున్నాడు. ఈ చక్రంలో ఆకులు నీ తండ్రి, నా తండ్రి యింకా కొందరున్నారు. ఈ చక్రాన్ని ఆపుచేయాలనుకున్నాను. అంత వేగంగా తిరిగే చక్రం ఒక్కసారి ఆగిపోతే ఆ ఊపుకి ఎన్నో ఆకులు రాలిపోవచ్చు. నా తండ్రిని రక్షించుకోవడం కోసం నీ తండ్రిని బలి పెట్టవలసి వస్తే ఆ తర్వాత నాకు బాధ కలగకుండా వుండడం కోసం నీకిదంతా ముందే చెప్పేశాను. నీ మూలానే ఇదంతా జరగబోతూంది. అందువల్ల నీకు చెప్పవలసిన నైతికమైన బాధ్యత కూడ నా మీద వున్నదని భావిస్తున్నాను." అంటూ కారు స్టార్ట్ చేశాడు.

"మనం ఎక్కడికి వెళుతున్నాం?"

"సి.బి.ఐ. డిప్యూటీ ఛీఫ్ - ప్రవల్లిక ఇంటికి."

* * * *

సూర్యారావుకి చాలా కోసం వచ్చింది. స్వామిలాంటివాడు అంత బాధ్యతారహితంగా ఎలా ప్రవర్తించాడు - అని అనుకున్నాడు.

పి.య్యేకి చెప్పి స్వామికి కనెక్షన్ యిమ్మన్నాడు. ఐదు నిముషాల్లో ఎస్.టి.డి. వచ్చింది.

"స్వామి లేరు" అని అట్నుంచి వినిపించింది.

"ఎవరు మాట్లాడుతున్నది?"

"రామ్‌లాల్."

"స్వామిని వెంటనే నాత్లో మాట్లాడమను."

"అలాగే!"

"అసలాయనకేమైనా బుద్ధి వుందా? చిన్నపిల్లల్తో అలా మాట్లాడతాడా?"

"ఏం మాట్లాడాడు?" అని అడగలేదు. రామ్‌లాల్. "సరే ..... అది కూడ చెపుతాను " అన్నాడు క్లుప్తంగా. సూర్యారావు నాలుక కరుచుకుని "వద్దులే" అన్నాడు.

"అలాగే" రామ్‌లాల్ ఫోన్ పెట్టేశాడు. సూర్యారావు మీటింగ్‌కి బయలుదేరాడు. ఈ సంభాషణ జరుగుతున్న సమయానికి విహారి విమానంలో ఢిల్లీ వస్తున్నాడు.

* * *

మంత్రి సూర్యారావుకీ, జపాన్ విదేశాంగ మంత్రికీ మధ్య అగ్రిమెంట్ జరిగే హాల్ అది.

ప్రభుత్వాధికారులతో హడావుడిగా వుంది.

జపాన్ నుంచి నౌక వస్తోంది. దాని తాలూకు కాగితాలపై పరస్పరం సంతకం పెట్టుకోవాలి.

"మీరు జపాన్ రావాలి" ఆహ్వానించాడు జపాన్ విదేశాంగ మంత్రి. "ష్యూర్ ష్యూర్" అంటున్నాడు సూర్యారావు. అదే సమయానికి సెక్యూరిటీ గార్డ్ వచ్చాడు "సార్! ఎవరో స్వామి తాలూకు మనిషట! కుదరదని ఎంత చెప్పినా వినటం లేదు. వెంటనే మిమ్మల్ని చూడాలని అడుగుతున్నాడు " అన్నాడు.

సూర్యారావు భృకుటి ముడివడింది. "ఇప్పుడే వస్తాను" అంటూ పక్క ఛాంబర్లోకి

వెళ్ళాడు.

చాలా చిన్న గది అది. కిటికీలకు పరదాలు వేలాడుతున్నాయి. ఎయిర్ కండిషనరు వల్ల చల్లగా వున్నదా గది. ఒక గోడకు నెహ్రూ, మరొక గోడకు ఇందిరాగాంధీ, పటాలు వేలాడుతున్నాయి. బయట హడావుడి లీలగా లోపలికి వినిపిస్తూంది.

విహారి గది మధ్యలో కూర్చుని వున్నాడు.

*          *          *

"నువ్వా" అన్నాడు సూర్యారావు కోపంగా.

జవాబుగా విహారి నవ్వేడు.

"స్వామి పేరెందుకు చెప్పావు? అసలెందుకు వచ్చావు?"

"ఇంత హడావుడి టైంలో నిన్ను బయటకి రప్పించాలంటే స్వామి పేరు ఉపయోగించక తప్పలేదు. ఇక ఎందుకొచ్చానంటే ..... అంటూ చేతిలో ప్యాకెట్ టేబుల్ విసిరేశాడు.

"ఏమిటది?"

"నీ కూతురు ఈ రోజు కట్టుకున్న చీరె ..... "

"వ్వాట్ ..... "

"జాకెట్ కూడా వుంది ..... "

"నీకేమయినా మతిపోయిందా? ..... పోలీస్ ..... పోలీస్ ..... పోలీస్ .....

"అరవకు, బయట పత్రికా విలేఖరులు కూడా వున్నారు. మంత్రి గారి కూతురి చీరె ఎవరి దగ్గరో దొరికిందంటే పాఠకులకు కావలసినంత మేత."

సూర్యారావు సర్దుకున్నాడు " ..... ఈ చీరె, జాకెట్ నీ దగ్గిరకెలా వచ్చాయి?"

"నిన్నటినుంచీ నీ కూతురు ఏదో బాధతో వుంది. ఈ రోజు నా దగ్గరకు వచ్చింది. నువ్వే ముఖ్యమంత్రి పదవికోసం చేసిన ఘాతుకాన్ని ఎవరో ఆమెకు చెప్పినట్లున్నారు. ఆ పిల్లల్ని రక్షించింది నేనే అని, ఆ వివరాలు నాకు తెలుస్తాయేమోనని కనుక్కోవటానికి వచ్చింది."

సూర్యారావు పళ్ళు బిగించి, "చెప్పేశావా?" అన్నాడు.

విహారి నవ్వేడు. "శత్రువు కూతురి అభినందనలు నాకు అవసరం లేదు. నేనేం చెప్పలేదు. చెప్పే టైం కూడా లేదు."

"మరేం చేశావు?"

"పులి బోనులోకి అడుగుపెట్టిన కుందేల్ని ఎవరయినా వదిలేస్తారా? ..... దాన్ని అక్కడే బంధించి, వెంటనే విమానంలో నీ దగ్గరకు వచ్చాను."

"దేనికి?"